క్లుప్తంగా

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి



ర్యాలీ నిర్వహిస్తున్న యర్రగుంట్ల విద్యార్థులు

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఇంద్రావతి మాట్లాడుతూ పటేల్ ఐక్యమత్యమే మహాబలమని ప్రజలకు సందేశమిచ్చారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



చాగలమర్రి గ్రామంలో బాణాసంచా దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రమేష్‌రెడ్డి

చాగలమర్రి: బాణాసంచా దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల వద్ద నీరు, అగ్ని మాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని, అలాగే గ్రీన్ కాకర్స్ పేరిట నిషేధిత పేలుడు టపాసులను విక్రయయించరాదన్నారు.

డీఎం రాజశేఖర్‌రెడ్డి సేవలు అభినందనీయం



ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న డిపో ఉద్యోగులు

ఆళ్లగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్‌గా సుదీర్ఘకాలం విధులు నిర్వహించిన రాజశేఖర్ రెడ్డి సేవలు శ్లాఘనీయమని ఆర్టీసీ ఉద్యోగులు కొనియాడారు. ఆళ్లగడ్డ డీఎంగా సుమారు 6 సంవత్సరాలుగా విధులు నిర్వహించి ఈ నెల 31వ తేదీ పదవీ విరమణ చేయనున్న సందర్భంగా బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో సన్మాన సభ నిర్వహించారు. డిపో అభివృద్ధికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేసిన కృషిని కొనియాడారు. రిటైర్‌మెంట్ జీవితాన్ని కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడపాలని ఆకాంక్షించారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి



భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న దృశ్యం

చాగలమర్రి: భవితకేంద్రాల్లో నిర్వహించే ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు జగదీశ్వర్, మారెన్న అన్నారు. ప్రత్యేక అవసరాలున్న 5 సవంత్సరాల నుంచి 14 సం.లలోపు వయస్సున్న మానసిక, శారీరక, దివ్యాంగులు, చెవిటి, మూగ, అంధత్వంతో బాధపడే పిల్లలకు సేవలు అందించేందుకు ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు బుధవారం ఫిజియోథెరపిస్టు ఎం.సుబ్బనర్సయ్య చిన్నారులకు ఎక్సర్‌సైజ్‌లు నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి



బ్లాక్‌రైస్ పైరును పరిశీలిస్తున్న అధికారులు

గోస్పాడు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నరేంద్రారెడ్డి అన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన రైతు బాలమద్దిలేటి వేసిన దేశీయరకాలైన వరిపైరు సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చు తక్కువే అని అన్నార. దేశీయరకాల కింద సాగుచేసిన వరిపైరును పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది రామాంజనేయరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



ధరలు ధాం ధాం!

- భారీగా పెరిగిన టపాసుల ధరలు
- ధరలు చూసి షాక్ అవుతున్న ప్రజలు
- జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన బాణసంచా విక్రయ దుకాణాలు

నంద్యాల: దీపావళి అంటేనే టపాసుల సంబరం. ప్రతి ఒక్కరూ బాణసంచా కాల్చడానికి ఇష్టపడతారు. అయితే, ఈ సారి వెలుగుల వ్యాపారంలో ధరల మోత కనిపిస్తోంది. గతేడాదితో పోల్చితే 20 నుంచి 30 శాతం మేర ధరలు పెరిగాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి. ఎక్కువగా వినియోగించే అగ్గి పెట్టెలు, కాకర ఒత్తులు, చిచ్చు బుడ్లు, తాళ్లు, పాము మందు బిళ్లలు, సీమ టాపాసుల ధరలు చుక్కలంటాయి. పిల్లల కోసమైనా కొన్ని కొందామని బాణ సంచా దుకాణాలకు వెళితే కనీసం రూ.2వేలు లేకుండా క్యారీ బ్యాగ్‌లోకి టపాకాయలు రావడం లేదు.

కళతప్పుతున్న పండుగ...

గతంలో దీపావళి పండుగ వస్తుందంటే నెల రోజుల ముందు నుంచే హడావుడి ప్రారంభమయ్యేది. యువకులు, పిల్లలు బాణసంచా కొనుగోళ్లలో బిజీగా ఉండేవారు. పండుగకు పది రోజుల ముందు నుంచే బాణ సంచా మోతలు వినిపిస్తూ రానున్న పండుగను గుర్తు చేసేవి. పండుగ అయిపోయిన తర్వాత మరో వారం రోజుల వరకు ఆ సందడి ఉండేది. నేడు ఎక్కడా ఆ పరిస్థితి కనిపించడం లేదు. బాణ సంచా కాల్పులు దీపావళి రోజున మాత్రమే కనిపిస్తున్నాయి. అది కూడా రాత్రి పూట గంట సమయం కూడా బాణ సంచా మోతలు వినిపించడం లేదు. పండుగ మర్నాడు అయితే అంతా నిశబ్ధమే.



డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు



దుకాణంలో టపాకాయలు కొనుగోలు దృశ్యం

కూటమి నాయకుల దుకాణాలే అధికం..

జిల్లాలో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాలు కూటమి నాయకులకే కేటాయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నంద్యాలలో రూ.48వేలు చెల్లించిన వారికే లాటరీలో వారి పేరు చేర్చినట్లు తెలిసింది. జిల్లాలో గత ఏడాది 178 దుకాణాలు ఏర్పాటు కాగా ఈ ఏడాది 200 పైగానే దుకాణాలు ఏర్పాటు చేశారు. నంద్యాల పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలు 73 ఏర్పాటు చేశారు. ఇందులో 12 దుకాణాలు అనధికారికంగా డబ్బులు తీసుకొని కూటమి నాయకులు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఒక్కో దుకాణదారుడి నుంచి రూ.48వేలు ముక్కుపిండి వసూలు చేసినట్లు సమాచారం. బరితెగించి టీడీపీ నాయకులు అక్రమ వసూళ్లు చేస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

అద్దెభవనంలో విజ్ఞాన కేంద్రం!



శిరివెళ్లలో ఓ ఇంటిలో నిర్వహిస్తున్న గ్రంథాలయం



ఇరుకు గదిలో న్యూస్ పేపర్లు చదువుతున్న పాఠకులు

- శిరివెళ్లలో గ్రంథాలయానికి సొంత భవనం కరువు
- ఆరు దశాబ్దాల నుంచి అద్దె భవనంలో నిర్వహణ
- సరైన వసతులు లేకపోవడంతో పాఠకులు ఇబ్బందులు

శిరివెళ్ల: నిరుద్యోగులకు, పుస్తక ప్రియులకు విజ్ఞానం అందించే గ్రంథాలయాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. పలు గ్రంథాలయాలకు సొంతభవనాలు లేకపోవడంతో దశాబ్దాల పాటు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మండలకేంద్ర శిరివెళ్లలో 18 వేల జనాభా ఉంది. ఇక్కడ ఉన్న గ్రంథాలయానికి శాశ్వత భవనం లేకపోవడంతో అద్దె ఇంటిలో నిర్వహిస్తున్నారు. దీంతో సరైన వసతులు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రంథాలయం 1966లో మంజూరైంది. నాటి నుంచి అద్దె భవనంలో కొనసాగుతోంది. మొదట పశు వైద్య కేంద్రం, అమ్మవారి శాల, బలిజపేట ప్రాంతాల్లో 56 ఏళ్లు ఉంది. ప్రస్తుతం పోస్టాఫీస్ వద్ద ఓ అద్దె ఇంటిలో నడుస్తుంది. గ్రంథాలయంలో 50 మంది పిల్లలు, 100 మంది పెద్దలు శాశ్వత సభ్యత్వం కలిగి ఉన్నారు. రోజుకు 53 మంది పాఠకులు ఈ లైబరీకి వచ్చి న్యూస్‌పేపర్లు, ఇతర పుస్తకాలు చదువుతుంటారు. అయితే ప్రస్తుత భవనంలో వారికి సరైన సదుపాయాలు లేవు. పుస్తకాలు భద్ర పరచడానికి ఒక గది, పాఠకులు చదువు కోవడానికి మరో గది మాత్రమే ఉంది. అవి కూడా ఇరుకుగా ఉన్నాయి. పక్కా భవనం నిర్మించాలని పాఠకులు కోరుతున్నా పట్టించుకునే వారు లేరు. స్థలం లభిస్తే భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

సరైన సదుపాయాలు లేవు



నేను 10 ఏళ్ల వయస్సు నుంచి అంటే 5 వ తరగతి నుంచి గ్రంథాలయానికి వస్తున్నా. ఇంత వరకు స్వంత భవనం లేదు. ఇరుకు గదుల్లోనే మేము చదువుకుంటున్నాము. ఇక్కడ అన్ని సదుపాయాలు ఉండవు. అధికారులు స్పందించి సొంత భవన నిర్మాణానికి చొరవ తీసుకోవాలి – **రామకృష్ణ, రిటైర్డ్ హెచ్‌ఎం**

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ మాధవి

చాగలమర్రి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని ఆర్‌కేఎస్‌కే కౌన్సిలర్ మాధవి అన్నారు. వ్యాధులు, మానసిక ఆరోగ్యంపై బుధవారం ముత్యాలపాడు గ్రామం ఎస్‌పీజీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జాతీయ ఆరోగ్య మిషన్ తరఫున ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలబాలికలు సంపూర్ణ ఆరోగ్యం, మెరుగైన విద్యను అభ్యసించినప్పుడే సమగ్ర అభివృద్ధిని సాధించగలుగుతారన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం రాష్ట్రీయ కిశోర్ స్వాస్థ్య కార్యక్రమం ప్రారంభించిందన్నారు. విద్యార్థుల కౌమార దశ శరీరక, మానసిక ఎదుగుదలకు ఆరంభ దశ కాబట్టి వారికి సంపూర్ణ పోషకాహారం అందించాలన్నారు. విద్యార్థులు భోజనానికి ముందు, మల విసర్జన తరువాత చేతులు శుభ్రపరచుకోవాలని సూచించారు. అతిసార లక్షణాలు కనబడితే వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం విద్యార్థులు సేవించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రియదర్శిని, ఉపాధ్యాయులు సుజీవ్, స్వామిరెడ్డి, చంద్రకళ, రాణి, స్టెల్లా, ఏఎన్‌ఎం లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలకు స్పందన కరువు



ఉయ్యాలవాడ రూపనగుడిసభలో మాట్లాడుతున్న తహసీల్దార్



రెవెన్యూ గ్రామ సభలో మాట్లాడుతున్న రుద్రవరం తహసీల్దారు మల్లికార్జున

నంద్యాల(అర్బన్): పలు మండలాల్లో రెవెన్యూ గ్రామ సభలకు రైతుల నుంచి స్పందన కరువైంది. భూ రీసర్వే పూర్తయిన మండలాల్లో కొద్ది రోజులుగా సభలు జరుగుతున్నాయి. అయితే, ఆశించిన స్థాయిలో రైతులు ఈ సభలకు హాజరు కావడం లేదు. అర్జీలు కూడా అరకొరగానే వస్తున్నాయి. బుధశారం నంద్యాల మండలంలో పెద్ద కొట్టాల, మిట్నాల గ్రామాల్లో బుధవారం గ్రామ సభలు నిర్వహించారు. పెద్దకొట్టాలో 68, మిట్నాలలో 42 దరఖాస్తులు వచ్చాయి. డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారావు మాట్లాడుతూ గ్రామ సభలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీటీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి 340.87 ఎకరాలు

ఉయ్యాలవాడ : భూ రీసర్వే నిర్వహించిన మండలంలోని రూపనగుడి గ్రామంలో ప్రభుత్వ భూమి 340.87 ఎకరాలు, దేవాలయాల భూములు 63.36 ఎకరాలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం ఆ గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. 237 మంది రైతులకు సంబంధించి 1860.33 ఎకరాలు రీసర్వే చేయడం జరిగిందన్నారు. ఎల్‌పీఎమ్ హద్దుల మార్పులు, సర్వే నంబర్లలో తేడాలు ఉన్నాయని సమస్యలను పరిష్కరించాలంటూ 27 మంది రైతులు దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్ఓ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

టి.లింగందిన్నెలో 84 దరఖాస్తులు

రుద్రవరం: మండల పరిధిలోని టి.లింగదిన్నె లో బుధవారం అధికారులు రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మల్లికార్జున రావు మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లోనే సభ లు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు,రైతులు ఏవైనా భూ సమస్యలు ఉంటే దరఖాస్తులు అందజేసుకోవచ్చని సూచించారు. దీంతో విస్తీర్ణంలో తేడాలు, మ్యూటేషన్, సర్వే నంబర్ల సమస్యలు వంటి వాటికి సంబంధించి 84 దరఖాస్తులు అందజేసినట్లు తహసీల్దారు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

కార్బండిజంతో అగ్గితెగులు నివారణ



పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

నంద్యాల(అర్బన్): కార్బండిజం 1 గ్రాము ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ప్రస్తుత దశలో ఉన్న వరికి సోకిన అగ్గి తెగులు, మాని తెగులు నివారించుకోవచ్చని నంద్యాల వ్యవసాదికారి ప్రసాదరావు అన్నారు. అదే విధంగా పొగాకు పంటను ఆశించిన ఆకుమచ్చ తెగులు నివారణకు థయోఫినేట్ మిథైల్ 1.5గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మండలంలోని పులిమద్ది, భీమవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పులిమద్ది గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఏఓ మాట్లాడుతూ జొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ఎకరాకు 5–6 లింగాకర్షక బుట్టలతోపాటు పక్షి స్థావరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మణిమోహన్‌రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ



మహదేవపురం సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఈఓఆర్డీ

శిరివెళ్ల: మండలంలోని మహదేవపురం, గుండంపాడు గ్రామ సచివాలయాలను బుధవారం ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయన సచివాలయాల్లోని పంచాయతీల తీర్మాణాలు, నిధుల మంజూరు, వ్యయాలు, సిబ్బంది హాజర్ పట్టికలను పరిశీలంచారు. గ్రామ సభ తీర్మానాల రికార్డులు సరిగ్గా ఉండాలని సభ జరిగిన వెంటనే ప్రజల సంతకాలను తప్పని సరిగా తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం పనుల ఫొటోలను ఎప్పటి కప్పుడు అప్‌లోడ్ చేయాని కార్యదర్శులను ఆదేశించారు. రక్షిత మంచినీటి పథకాలు, చేతి పంపుల్లో నీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. రోగాల నివారణకు ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. కార్యాలయాల వేళలను తప్పని సరిగా పాటించాలన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సెలవులు పెట్టరాదన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ చట్టం బిల్లును వ్యతిరేకించాలి

నంద్యాల(అర్బన్): పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న వక్ఫ్‌బోర్డు సవరణ చట్ట బిల్లును టీడీపీ ప్రభుత్వం వ్యతిరేకించాలని ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూనిస్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మైనార్టీ సంఘాలు వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వ్యతిరేకించాలని సభలు, సమావేశాలు నిర్వహించారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సవరణ బిల్లును వ్యతిరేకించకపోతే ముస్లింలు ఆ పార్టీకి దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు.

కొండయ్య మృతికి సంతాపం

నంద్యాల(అర్బన్): కొలిమిగుండ్ల మండలం బెలూం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు కొండయ్య మృతికి గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకులు బుధవారం సంతాపం తెలిపారు. స్థానిక కార్యాలయంలో కొండయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పేద ప్రజలకు వైద్య సేవలు అందించే ఆర్‌ఎంపీ డాక్టర్లను హతమార్చడం దారుణమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు దస్తగిరి, శ్రీనివాసులు, నాగేశ్వరరావు, రమేష్, బాలుడు, తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో తెలుగు మీడియం ఆప్షన్ ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో తెలుగు మీడియం ఆప్షన్ ఇవ్వాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షరీఫ్, రాష్ట్ర అధికార ప్రతినిధి వీరబ్రహ్మం ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం వారు మాట్లాడుతూ 2025 మార్చి నెలలో జరగబోయే పరీక్షల నామినల్ రోల్స్ పంపుటకు, పరీక్ష ఫీజు చెల్లించుటకు షెడ్యూల్ విడుదల చేశారన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని తెలుగు మీడియంలో రాసేందుకు ఆప్షన్లు కల్పించి దీనిపై నెలకొన్న సందిగ్ధతను తక్షణమే తొలగించాలని కోరారు.

డీటీగా కిషోర్‌కుమార్

శిరివెళ్ల: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా కిషోర్‌కుమార్ విధుల్లో చేరారని తహసీల్దార్ పుష్పకుమారి బుధవారం తెలిపారు. గత డీటీ మాధవ దొర్నిపాడుకు బదిలీ కావడంతో ఈ నియామకం జరిగిందన్నారు. నూతన డీటీ శ్రీశైలం నుంచి బదిలీపై వచ్చారన్నారు.

పెరుగుతున్న అతిసారం కేసులు

రుద్రవరం: మేజర్ పంచాయతీ రుద్రవరంలో అతిసారం బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోది. నాలుగు రోజులుగా గ్రామంలోని రెండు కాలనీల్లో అతిసార కేసులు తగ్గడం లేదు. మంగళవారం 8 బుధవారం మరో రెండు కేసులు నిర్ధారణ అయ్యాయి. జిల్లా పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్, మండల పరిషత్ , రెవెన్యూ తదితర శాఖల అధికారులు గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పనులు వేగవంతం చేశారు.

ఘనంగా శ్రీసత్యమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



గ్రామదేవత శ్రీసత్యమ్మతల్లి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న వేద పండితులు

చాగలమర్రి: మండల కేంద్రః చాగలమర్రిలోని ఖల్లగడ్డ వీధిలో గ్రామ దేవత శ్రీసత్యమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని 3 రోజుల పాటు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. చివరి రోజైన బుధవారం నూతన ఆలయంలో వేద పండితులు శ్రీనివాస శర్మ బృందం ప్రత్యేక పూజలు నిర్వహించింది. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు మధ్యాహ్నం నిర్వాహకులు అన్నదానం చేశారు.

పప్పుశనగ సాగుకు శ్రీకారం



ట్రాక్టరు ద్వారా శనగ విత్తనం వేస్తున్న రైతు

దొర్నిపాడు: మండలంలో శనగ పంటను మాతృపంటగా భావిస్తారు. వర్షా ఆధారిత పంట కావడంతో కేవలం మూడు నెలల్లోనే ఈ పంట చేతికి వస్తుంది. దీంతో ప్రతి ఏటా మండలంలో 4వేల హెక్టార్లలో సాగు చేస్తారు. క్రిష్టిపాడు, దొర్నిపాడు, చాకరాజువేముల, డబ్ల్యూ కొత్తపల్లె, గుండుపాపల, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల్లో అధికంగా సాగుచేస్తారు. ఇప్పటికే పొలాల్లో రసాయన ఎరువులను విత్తిన తర్వాత మంచిగా వర్షం కురవడంతో రైతులు సాగుకు సన్నద్ధం అయ్యారు. ప్రస్తుతం తెల్ల శనగ క్వింటా రూ.9,000, ఎర్ర శనగ క్వింటా రూ.7వేల వరకు ఉన్నాయి. మొలకెత్తిన తర్వాత ఓ సారి వర్షం కురిస్తే ఎకరానికి 8 నుంచి 10 బస్తాల వరకు దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

స్పోర్ట్స్

నంద్యాలకు పేరు తేవాలి

నంద్యాల(న్యూటౌన్): జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో నంద్యాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకొని రావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం నంద్యాల పట్టణంలోని శ్రీగురురాఘవేంద్ర విద్యాసంస్థల చైర్మన్ పెద్దిరెడ్డి దస్తగిరిరెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి త్రోబాల్ పోటీల వాల్ పోస్టర్లను మంత్రి చేతుల మీదుగా విడుదల చేశారు. ఆయన క్రీడలకు ప్రోత్సాహం అందిస్తున్న గురు రాజ విద్యాసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు. జాతీయ స్థాయిలో నంద్యాల క్రీడాకారులు రాణించడం అభినందనీయమన్నారు. నవంబర్ 2వ తేదీ నుంచి నాలుగో తేదీ వరకు గురురాజ క్రీడా మైదానంలో జరిగే త్రోబాల్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలను విజయవంతం చేయాలని డైరెక్టర్లు షేక్షావలిరెడ్డి, మౌలాలిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో బుధవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. ఇందులో మహిళలు, పురుషులు దాదాపు 72 మంది పాల్గొన్నట్లు కుస్తీ పోటీల అసోసియేషన్ కార్యదర్శి రాబర్ట్ తెలిపారు. ఎంపికైన వారు నవంబర్ 9, 10 తేదీల్లో అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి కుస్తీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్ : 9676095979 నంబరును సంప్రదించాలన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు కేశవరెడ్డి విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): సౌత్‌జోన్, జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు కేశవరెడ్డి విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ ఉదయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగో రాష్ట్ర సీనియర్, రెండవ రాష్ట్ర సబ్ జూనియర్, క్యాడెట్ జూనియర్, సీనియర్ చాంపియన్‌షిప్ పోటీలు అక్టోబర్ 26, 27 తేదీల్లో తెనాలిలో నిర్వహించారన్నారు. ఇందులో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొనగా టెక్కె బ్రాంచ్‌కు చెందిన కేశవరెడ్డి విద్యార్థులు బాలుర జూనియర్ అండర్–46 కేటగిరిలో వెంకటసాయి లోహిత్, బాలుర సబ్ జూనియర్ అండర్–21 కేటగిరిలో దామరేకుల ప్రజోష్, ఉదయ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్, జాతీయ స్థాయి క్రీడలకు అర్హత సాధించారన్నారు. ఇందుకు కృషి చేసిన కోచ్‌లను పాఠశాల చైర్మన్ కేశవరెడ్డి అభినందించారు.

2న ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక కంట్రోల్ రూమ్ సమీపంలోని స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో నవంబర్ 2న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 విభాగంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యదర్శి హర్షవర్దన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు స్థానిక కిసాన్ ఘాట్ వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్, వాటర్ పోలో క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు



ఎస్సీ కాలనీలో సీసీరోడ్డుపై పేరుకున్న మురుగును తొలగిస్తున్న దృశ్యం

రుద్రవరం: అతిసారం ప్రబలిన నేపథ్యంలో మండల కేంద్రం రుద్రవరంలో పారిశుద్ధ్య మెరుగుకు చర్యలు చేపట్టారు. సీసీ రోడ్లపై పేరుకున్న మురుగును తొలగించడంతో పాటు కాల్వల్లో జేసీబీతో పూడిక తీయించారు. నాలుగు రోజులుగా రుద్రవరంలోని ఎస్సీ కాలనీ, చంద్రునిపేటలో అతి సారం వ్యాధి ప్రబలడంతో నివారణకై పారిశుద్ధ్య పనులు చేపట్టారు. తాగు నీరు ఎక్కడా కలుషితం కాలేదని క్లోరినేషన్ చేసిన నీటినే సరఫరా చేయిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మనోహర్, డీఈ రవికుమార్ తెలిపారు. పారిశుద్ధ్య లోపం వల్ల వ్యాధి ప్రబలి ఉండవచ్చని ఎంపీడీఓ,ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. గ్రామ సర్పంచు విజయలక్ష్మి, ఈఓ సుబ్బారావు పాల్గొన్నారు.